● హాస్యకథ



# మాదీఫల'రసా'యనం

ఆ మాట వినడంతోనే పరుగు లంఘించుకున్నా. పరుగెడుతూనే ప్యాంట్ జిప్ పైకి లాక్కున్నా. చొక్కా బొత్తాలు సగమే పెట్టుకున్నా. ఏడుపు వల్లనో, చెమట వల్లనో తెలీదుగాని మొహమంతా తడిసిపోయింది. అర్ధరాత్రి చీకట్లో దారి సరిగా కనిపించదు. ఒకటి ... రెండు ... మూడు ... మలుపులు తిరిగి నేరుగా వెళ్ళి ఆ ఇంటి ముందు గేటును 'ఢాం' అని ఢీకొని దఢేలుమని క్రిందపడ్డా.

రెండు క్షణాల తర్వాత తెలివి వచ్చింది. ఇంకా లస్యం చేయలేదు. గేటు లోపలి వైపు తాళం వేసి వుంది. అంతే! ఇంకాలోచించకుండా, బరబరా ఎక్కేసి ప్రహరీగోడ దూకేశా. ఈ వేగంలో ఊడిపోయిన ప్యాంట్ జిప్‌ని కూడా చూసుకునే టైం లేదు.

కాలింగ్‌బెల్ నొక్కితే ఆలస్యమైపోతుందని తలుపుని దబదబా బాదేశా! రెండు నిముషాల తర్వాత ఇంట్లో లైట్లు వెలిగాయ్! అదే సమయంలో అప్పటి దాకా ఇంటి వెనక కునుకు దీస్తున్న ఇంటి కుక్క 'భలే ఛాన్స్' అనుకొని మొరుగుతూ నామీదకు దూకబోయింది. అదే క్షణంలో తలుపు తెరుచుకుంది. కుక్క నా మీద దూకే లోగా నేను లోపలికి దూకేశా. ఆ ఊపులో తలుపు తీసినవాళ్ళమ్మాయి క్రింద, నేను పైనా పడ్డాం. నేను కంగారుగా లేచి ఒక చెత్తో ప్యాంట్ జిప్, మరో చెత్తో చెరిగిపోయిన క్రాఫ్ సరిచేసుకోబోతున్న సమయంలో వచ్చేశారు ఆర్వీ రావ్!

వస్తూనే కింద వెల్లకిలా పడుకొని వున్న వాళ్ళమ్మాయినీ, లేచి సర్దుకుంటున్న నన్నూ చూసి,

"మరీ ఇంత ఫాస్టా? క్షణాల్లోనే రేప్ చేసేశావా?"

అంటూ నా మీద నిప్పులు చెరుగుతూ పిస్టల్ కోసం డ్రాయర్ సొరుగు వెతకబోయాడు.

నేనేమాత్రం ఆలస్యం చేయలేదు. వెంటనే వెళ్ళి ఆయన రెండు కాళ్ళను గట్టిగా పట్టుకొని బోరున ఏడుస్తూ,

"నన్ను క్షమించండి సార్! ఘోరం జరిగిపోయింది. నాకు తెలీకుండానే జరిగిపోయింది సార్!" అన్నాను.

"అర్ధరాత్రి ఇంటికొచ్చి క్షణాల్లో నా కూతుర్ని రేప్ చేసేసి; తెలీకుండా జరిగిపోయిందంటావా? క్షమించడం కుదరదు" అన్నాడాయన ఉగ్రరూపంతో.

"రేప్ గురించి కాదు్సార్! వేరే ఘోరం జరిగిపోయింది సార్" అన్నాను వెక్కి వెక్కి ఏడుస్తూ.

"అంటే ... అంటే ... ఈ క్షణం సేపట్లో మరో ఘోరం కూడా చేసేశావా? ఇంత ఫాస్టా! అమ్మో విన్నపలు క్షమించను." అంటూ పిస్టల్ కోసం టేబుల్ సొరుగులన్నీ చకచకా వెతికేయడం మొదలెట్టాడు.

నేను అమాంతం ఆయన వెనుకవైపుగా వెళ్ళి వాటేసుకున్నట్టుగా గట్టిగా చేతులు పట్టేసుకున్నాను.

"డామిట్! ఏంటిది ... వాటీస్ దిస్ ... ఆడ మగా తేడా కూడా తెలీట్లేదా ... స్టుపిడ్ వదులు"

అంటూ నన్ను విదిలించేశారు ఆర్వీ రావ్. ఇక లాభం లేదని నేను

"సార్" అని గట్టిగా అరిచాను. ఆయన అదిరిపడి నా వంక చూశారు. నా కేకకు ఆయన కళ్ళజోడు జారి క్రిందపడి ముక్కలైపోయింది. ఆయన చేసేది లేక కుర్చీలో కూలబడ్డారు.

అవుడు నేను నెమ్మదిగా ఆయన దగ్గరకెళ్ళి,

"సార్ ఇక్కడ రేప్‌లు, గట్రాలు ఏమి జరగలేద్సార్. అసలు జరిగిందేమిటంటే ... నిన్న మీకు మాదీఫల రసాయనం అని ఒక సీసా ఇచ్చాను కద్సార్! దాన్ని ఓపెన్ చేశారా సార్?" అని అడిగాను.

అప్పటికి కాస్త స్థిమితపడిన ఆర్వీ రావ్,

"ఏదీ! నిన్న మధ్యాహ్నం ఆఫీస్‌లో ప్యాక్ చేసి ఇచ్చావ్! ఆ బాటిలేనా?" అని అడిగారు.

"అవున్సార్ అదే ... అదే ... దాన్ని ఓపెన్ చేసి తాగారా సార్!" అనుమానంగా, ఆందోళనగా అడిగాను.

"లేదయ్యా!" అన్నారాయన కాలితో కళ్ళజోడు కోసం వెతుకుతూ.

"హమ్మయ్య ... గొప్ప అపాయం తప్పిపోయింది సార్" గుండెల మీద చేయి వేసుకొని నేను ఆయన కాళ్ళ దగ్గర కూలబడ్డాను.

"దాన్ని నేనే వాడదామనుకున్నా. కాని మన పెద్ద బాస్ గారు ఎప్పటి నుంచో అడుగుతున్నారు కదాని ఆయనకి ప్రజంట్ చేశా" అన్నారు ఆర్వీ రావ్.

"సార్!" నేను వెంటనే పెద్దగా అరిచేశా.

ఆ అరుపుకి ఆయన కుర్చీలోంచి కిందపడబోయి నిలదొక్కుకుంటూ,

"ఏమైందయ్యా?" అన్నారు.

"సార్ మనం అర్జంట్‌గా ఆయన దగ్గరికి వెళ్ళాలి సార్" అన్నాను.

"ఎందుకు?" అని అడిగారు.

నేను ఆయన చెవిలో నెమ్మదిగా,

"అది మాదీఫలరసాయనం కాదట. అందులో శుద్ధి చేసిన ఆముదం వుందట. నాకు ఆ సీసా ఇచ్చిన కుర్రాడు ఇందాకే వచ్చి చెప్పాడు" అన్నాను.

అది వింటూనే ఆర్వీ రావ్,

"హా ..." అంటూ కుర్చీలో విరుచుకుపడిపోయాడు. నేను ప్రక్కనే వున్న జగ్గులో నీళ్ళు ఆయనపై గుమ్మరించాను. ఆయన తేరుకొని,

"నా కొంప ముంచావ్ కదయ్యా! నా ప్రమోషన్ కోసం లంచంగా ఆయనకి ఆ మాదీఫల రసాయనం ఇచ్చా. ఇపుడది ఆముదమని తెలిస్తే... దాన్ని ఆయన తాగితే ... ఓర్నాయనో... నా ప్రమోషన్ సంగతి దేవుడెరుగు. వున్న ఉద్యోగమే వూడిపోతుందే" అని లబోదిబోమన్నాడు ఆర్వీరావ్.

"ఏడ్వడానికిది సమయం కాద్సార్. ఈ సమస్యని 'ఆల్‌మట్టి'లా నాన్చకూడద్సార్. హైటెక్ లెవెల్‌లో వెంటనే పరిష్కరించాలి" అని ఆర్వీరావ్ గార్కి ధైర్యం చెప్పాను.

"హైటెక్ అంటే గుర్తుకొచ్చింది. ఆయన ఇంకో అర్ధగంటలో హైటెక్ బస్సులో విజయవాడ వెళ్తున్నాడు. మనం వెంటనే వెళ్ళి ఆయనకా విషయం చెప్పేయాలి" అన్నారు ఆర్వీ రావ్.

"అలాగే సార్! అయితే వెంటనే బయలుదేరండి. నేను ఆటో తెస్తాను. అంటూ వెనుదిరిగాను. అప్పటికి లేచి తేరుకున్న వాళ్ళమ్మాయి నన్ను ఓరకంట చూస్తూ,

"నా మీద పడింది నువ్వేనా?" అని సిగ్గుపడుతూ అడిగింది.

"అమ్మో మరో విషమ పరిస్థితి." అని వెంటనే బయటకు గెంతి రోడ్డుమీద పడ్డాను. అదే సమయంలో అటుగా ఆటోరావడం, నేనాపేయడం చకచకా జరిగిపోయాయి. కళ్ళజోడు పగిలిపోవడంతో ఆర్వీరావ్ గార్ని చేయిపట్టుకుని ఆటోలో కూర్చోబెట్టా. ఆటోలో స్పీడుగా బస్‌స్టాండ్‌కు చేరుకున్నాం.

> "జ్వాలాముఖి ఇంటర్వ్యూపై మద్దూరి నగేష్‌బాబు ప్రతిస్పందన అతిత్వరలో"

ఆటో బస్టాండ్ చేరుకోగానే బయటికి దూకేసి నా జేబులో చేయిపెట్టి డబ్బులు తీసే టైం లేక ఆర్వీరావ్ గారి జేబులోంచి పర్సుని లాగేసి ఓ వంద నోటుని ఆటోవాడికిచ్చేసి ఆర్వీరావ్‌గారి చేయి పట్టుకుని చకచకా బస్టాండ్‌లోకి లాక్కెళ్ళాను.

విజయవాడ వెళ్ళే హైటెక్ బస్సు బయలుదేరడానికి సిద్ధంగా వుంది. ఆర్వీ రావ్ కళ్ళు చిట్లించి అటూ ఇటూ చూస్తుంటే, కిటికీ దగ్గరే కూర్చుని తల బయటికి పెట్టి కునుకుదీస్తున్న పెద్ద బాస్ గార్ని నేను చూసి "సార్" అని పెద్దగా అరిచాను. ఆ కేకకు పెద్ద బాస్ ఉలిక్కిపడిలేచి మిమ్మల్ని చూసి కళ్ళు నలువుకుంటూ,

"మరీ బస్టాండ్ దాకా వచ్చి సాగనంపాలటోయ్. మరీ మర్యాదలెక్కువైపోతున్నాయ్" అన్నాడు.

ఆర్వీ రావ్ బిక్కచచ్చిపోయిన మొహంతో,

"సార్ ... అదీ ... అదీ" అని నీళ్ళు నమలసాగాడు.

"ఓ అదా! నీ ప్రమోషనేనా! తప్పకుండా చేస్తాలే. దాని కోసం ఇంతరాత్రి రావాలా చెప్పు" అన్నాడు పెద్ద బాస్.

ఇహ లాభం లేదని నేనే ధైర్యం చేసి,

"సార్ మధ్యాహ్నం రావ్‌గారు మీకిచ్చిన మాదీఫల రసాయనం కూడా తీసుకెళ్తున్నారా?" అని అడిగాను.

"దాన్నెలా మరచిపోతానోయ్. భలేవాడివే" అంటూ పకపకానవ్వాడు పెద్ద బాస్.

'ఇంకా అవు' అని మనసులో అనుకుని.

"అది మాదీఫలరసాయనం కాదుసార్! శుద్ధి చేసిన ఆముదం పోసిన సీసాపై పొరపాటున మాదీఫల రసాయనం అని లేబుల్ అతికించారట. అందుకని ..." అని మాట పూర్తి చేసేంతలో పెద్ద బాస్ తన ప్రక్కనే బ్యాగ్‌లో వున్న సీసాని నా చేతిలో పడేసి,

"ఇంకా నయం ... దాన్ని తీసుకెళ్ళి మా ఆవిడకిస్తే ...దాన్ని తను తాగితే... నా కొంప మునిగేది" అన్నారు. నేను మాత్రం 'హమ్మయ్య' అని నిట్టూర్చాను.

"సార్ ... మరి ... మరి ... నా... ప్రమోషన్" అని నసుగుతూ అడిగాడు ఆర్వీ రావ్.

"ముందా ఆముదం నువ్వు తాగు. మోషన్ ఫ్రీగా అవుతుంది. ఆ తర్వాత ప్రమోషన్ గురించి ఆలోచిద్దాం" అన్నాడు పెద్ద బాస్ కోపంగా.

ఆర్వీ రావ్ ఆముదం తాగిన మొహం పెట్టుకొని కాళ్ళీడ్చుకుంటూ నా వెంట బస్టాండ్ బయటికి వచ్చేశాడు. నేను నా చేతిలోని సీసాని కోపంగా గోడకేసి విసిరేశాను. అది భళ్ళున బద్దలైపోయింది.

ఆటో కోసం వెతుకుతుంటే అకస్మాత్తుగా ఘటకాచలం ప్రత్యక్షమై,

"హలో ... ఏంటిలా వచ్చారు? ఊరెళ్తున్నారా?", అని నన్ను పలకరించాడు.

నేను

"అది సరే! మాదీఫల రసాయనం అని చెప్పి మీవాడి చేత శుద్ధి చేసిన ఆముదం పంపిస్తావా?" అన్నాను కోపంగా. "ఆముదం ఏమిటి?" అని అడిగాడు ఘటకాచలం.

"ప్రొద్దున మీవాడు నాకు మాదీఫలరసాయనం సీసా తెచ్చి ఇచ్చాడు. ఓ గంట క్రితం వచ్చి అది మాదీఫల రసాయనం కాదు, ఆముదం అని చావు కబురు చల్లగా చెప్పాడు" అని అసలు సంగతి వివరించాను.

"సారీ బ్రదర్! అది శుద్ధి చేసిన ఆముదం కాదు. ఒరిజినల్ మాదీఫల రసాయనమే! ఈ మధ్యవాడు దాన్ని తెగ తాగేస్తున్నాడని ... అలా అబద్ధం చెప్పా. అంతే ." అన్నాడు. ఆ మాట వింటూనే ఆర్వీ రావ్ అదోరకమైన సౌండ్‌చేస్తూ నేలజారిపోయాడు. నాకూ ఆ తర్వాత ఏం జరిగిందో తెలీలేదు. తెలిశాక మిగతాది చెబుతా ...

—దండుమూడి నందకిషోర్